శ్రీ చందు సుబ్బారావు

# మేధావి

ఇరవైదేళ్ళ క్రితం—

అన్నయ్య యూనివర్సిటీలో లెక్చరర్‌గా పనిచేస్తుండేవాడు. అప్పటికి వాడికింకా పెళ్ళికాలేదు. ఇరవైనాలుగ్గంటలూ పుస్తకాల్లోనే గడిపేవాడు. అన్నయ్య చాలా తెలివిగలవాడనీ, 'మేధావి' అనీ అంతా అనుకునేవాళ్ళు. వాడా వయసుకే ఎంతో సాహిత్యం, సైన్సూ, తత్వశాస్త్రం చదివాడనీ, ప్రొఫెసరు కుండాల్సిన పరిజ్ఞానం వుందనీ, చాలా గొప్పవాడవుతాడనీ వాడి స్నేహితుల నోటి నుండే వినేదాన్ని.

నేను బియ్యే ప్యాసయింతర్వాత ఇంట్లో అంతా 'ఇంక చదువు చాల'న్నారు. నాకు ఎమ్మే చదవాలనుండేది. చిన్నప్పటినుండీ భాస్కరం అన్నయ్యలా పెద్ద పెద్ద పుస్తకాలు చదివి పైకి రావాలన్న కోర్కె పీడించేది. చిన్నన్నయ్య 'యసెల్సీ'తో ఆపి వ్యాపారం చేసుకుంటున్నాడు. తమ్ముడు తరగతులు 'ఢీ' కొడుతున్నాడు. నాన్నకెటూ చదువులేదు. అసలు మా వంశంలో భాస్కరానికి తప్ప ఎవరికీ చదువబ్బలేదు. నేను కూడా చదువుకుంటే బావుణ్ణనిపించేది. ఈ బియ్యే డిగ్రీతో చదువుకు వీడ్కోలు కాబోలు, ఏ పురుషోత్తముడికో జీవితం అంకితం కాబోలు అనుకుంటుండగా భాస్కరం అన్నయ్య దగ్గర్నుండి టెలిగ్రామ్ వచ్చింది.

'మిలియన్ కిసెస్ టు కామూ — ఎమ్మే సీట్ రిజర్వ్‌డ్ హియర్' అని.

అన్నయ్య నా పాలిటి దైవంలా కనిపించాడు. వాడికి చిన్నప్పటినుండీ నా మీదున్న ప్రేమ ఎవరికి చెప్పినా విడ్డూరంగా వుంటుంది. పొట్టిగా, చిన్నగా ఉండే నన్ను, ఆరడుగుల ఎత్తున భారీగావుండే అన్నయ్య ఒక్కచేత్తో గాల్లోకి లేపి ఏడిపించేవాడు. అమ్మ విసుక్కునేది, 'ఇదేమిట్రా—అదేమన్నా పసిపిల్లా' అంటూ.

చిన్నన్నయ్య నాతో మాట్లాడటమే అరుదు. వాడికి నేనెప్పుడూ దెయ్యంలాగే కనిపించేదాన్ని. తమ్ముడికీ నాకూ అసలు పడేదికాదు. నాకు చదువొస్తుందని వాడికెప్పుడూ అసూయ. మా అమ్మ సంతానం నల్గురం ఒక్కొక్క ఏడు తేడాతో పుట్టాం. భాస్కరం పద్నాలుగో ఏటే ఎసెల్సీ పాసయ్యాడు. మిగతావాళ్ళం పదిహేడో ఏటకాని స్కూలుచదువు దాటలేదు.

భాస్కరం అన్నయ్యలా పెద్ద పెద్ద విషయాలు నేర్చుకోవాలి. ఎవరికీ తెలియని సంగతులు మాట్లాడాలి. వాడిలా అందర్నీ ఆకర్షించాలి. నా మనస్సులో ఎప్పుడూ ఇదే ఆలోచన. నేనేమో ఆడపిల్లను. అందులోనూ అతి చిన్న విగ్రహం. తెలివి తేటలు కూడా సాదా మార్కు. రాసిపెట్టి ఉన్నవాడికి తప్ప అన్యులకు అందగత్తెలా కనిపిస్తానని నమ్మకంలేదు. వాడిలా ఎలా అవ్వగలనో అంతుపట్టేదికాదు. ఇది కలలాగ మిగిలిపోవటం 'ఖాయం' అనుకుంటుండగా అన్నయ్య టెలిగ్రాం వచ్చింది.

తర్వాత రెండ్రోజులకు అన్ని వివరాలతో వాల్తేరునుండి ఉత్తరం కూడా వచ్చింది. 'కామేశ్వరి చదువుకయ్యే ఖర్చులు తానే భరిస్తాననీ, ఇద్దరం వండుకుతింటామనీ, తప్పక ఎమ్మేలో చేర్పించటానికి పంపించమనీ' ఉందందులో.

నాన్న కొంత తటపటాయించాడు. 'ఎమ్మే ఎందుకు? వచ్చి ఏం చేస్తుంది. రాగా పోగా తేబోయే మొగుడు కూడా ఎమ్మే అయ్యుండాలి. అంతకంటే నిర్వాకం ఏముంది. ఇది ఉద్యోగాలు చెయ్యబోయిందా. ఈ లక్కపిడతకు ఎవ్వడే ఉద్యోగం ఇవ్వకూర్చున్నాడు. దీని చదువువంకపెట్టి వాడు ఆ పంపించే డబ్బుకూడా పంపించడు...'నాన్న ఆలోచన్లకు అర్థం లేకపోలేదేమో...ఆశలకూ, కోర్కెలకూ అర్థాలు ఇంత స్పష్టంగా చర్చించటానికి వీలులేకపోవచ్చు.

అమ్మ తటస్థంగా వూరుకుంది. 'దాని గీతలో ఏముందో' అంటూ. చిన్నన్నయ్య 'దానిష్టం' అన్నాడు. తమ్ముడు పెద్ద తెలిసినవాడిలా 'అనవసరం' అన్నాడు. వెధవనిచూస్తే తన్నబుద్ధేసింది. ఇంటర్‌తో మూడుసార్లుగా కుస్తీలు పడుతున్నాడు... అనవసరమట !

నాన్నకో బలహీనతుండేది. ఎన్నన్నా, అనుకున్నా భాస్కరం అన్నయ్య మాటకు చివరకు తలూపేవాడు. బలవంతం చెయ్యటానిగ్గాను నేను కూడా రెండుపూటలు అన్నం మానేసాను. వారం తర్వాత భాస్కరం రెండో ఉత్తరం రాసాడు, 'సీటుకి టైమయిపోతోంది. పంపించండి' అంటూ.

నాన్న వాల్టేరుకు టికెట్టుకొని అన్నయ్యకు 'టెలిగ్రాం' ఇచ్చాడు!

*　　*　　*

ఎమ్మే ఫిలాసఫీలో చేరాను.

నూర్రూపాయలకు అన్నయ్య ఓ చిన్న పోర్షన్ అద్దెకు తీసుకున్నాడు. ఇద్దరం వంట చేసుకుని తిని కలిసి యూనివర్సిటీకి పోయేవాళ్ళం. ఎత్తుగా, లావుగ కళ్ళద్దాలతో హుందాగా వంకర జుట్టు ఊపుకుంటూ నడిచే అన్నయ్యప్రక్క నడవటం సరదాగా

వుండేది. స్టూడెంట్సూ, టీచర్లూ 'భాస్కరం చెల్లెలు' అని మెల్లగా గుసగుసలు చెప్పుకోవటం వినిపించేది. శాస్త్రిగారయితే మరీ చనువుగా పలకరించేవారు.

శాస్త్రిగారు అన్నయ్య ప్రధాన స్నేహితుల్లో ఒకరు. వాడి డిపార్ట్‌మెంట్‌లోనే రీసెర్చి చేస్తున్నారు. మంచి సంగీత జ్ఞానం కలవారు. ఎంతో బాగా పాడతారు. వాడి ఇతర స్నేహితులు చంద్ర, కృష్ణారావుగార్లు. చంద్రగారు కవి. రోజూ మా యింటికొచ్చి కవిత్వం వినిపించేవారు. కృష్ణారావుగారు మాటకారి. చమత్కారంగా మాట్లాడుతూ అందర్నీ నవ్వించేవారు. ప్రతిరోజూ రాత్రి భోజనాలయ్యాక మా యింట్లో సభతీర్చేవాళ్ళు. చంద్రగారి కవిత్వంతో ప్రారంభమయ్యేది సదస్సు. కృష్ణారావుగారు సుదీర్ఘంగా నవ్వించిన తర్వాత శాస్త్రిగారిని ఓ పాట పాడమని సభ అర్థించేది. ఆయనకు మహా సిగ్గూ, మొహమాటమూను. కాసేపు జంకినా, గొంతెత్తితే అంతా చెవులప్పగించి వినేవాళ్ళం.

'వండర్‌ఫుల్‌రా శాస్త్రీ, ఎనదర్ సైగల్ ఇన్ ది మేకింగ్' అనేవాడు అన్నయ్య.

'ఇన్ ది ప్రాకింగ్' అని చమత్కరించేవారు కృష్ణారావుగారు. అంతా నవ్వులు. ఎవరెన్ని మాట్లాడినా చివరకు అన్నయ్య కామెంట్‌కోసం కలవరించేవాళ్ళు. అన్నయ్య బిగించిన తీగలా కూర్చుండి ఎక్కడ రసస్పందన ఉందో అక్కడ పలుకుతుండేవాడు.

అన్నయ్య చంద్రగారి నొకసారి 'అరే కవీ, మా సిస్టర్‌మీద కవిత్వం చెప్పరా' అన్నాడు. చంద్రగారు నావంకోసారి చూసి ఆశువుగా

'తత్వశాస్త్ర మభ్యసించు చిట్టితల్లి కాముా,

ఆడపిల్ల కెందుకమ్మ కసరత్తూ సాముా'అన్నారు. అన్నయ్య పగలబడి నవ్వి

'మరో ఆరుద్రవిరా కవీ' అని అభినందించాడు

ఆదివారాలొస్తే అందరం బీచ్‌కి పోయేవాళ్ళం. వీళ్ళ మాటలజోరూ, సముద్రపు హోరూ ఎంతో సరదాగా ఉండేది. ఇసకలో నడవటంవలన ఒకరు ముందూ, ఒకరు వెనకా పడేవాళ్ళు. శాస్త్రిగారు మితభాషి కావటంచేత మాట్లాడటానికేం తొందర లేదన్నట్లు వెనక పడేవారు. వాళ్ళతో నడవలేక నేనూ వెనకపడేదాన్ని. శాస్త్రిగారు నా నడకనుచూసి ఓసారి 'ఆడపిల్లకెందుకమ్మ కసరత్తూ, సాముా' అని నవ్వేసారు. నేనూ నవ్వేసాను. ఆయన నా కళ్ళలోకి తొలిసారిగా చూసారు. కొత్తగా ఉంది. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించింది.

శాస్త్రిగారు 'పాడవేల రాధికా' అనే పాట పాడినప్పుడూ 'అలనాటి కథలన్ని కలలాయెనా' అనే పాట పాడుతున్నప్పుడూ 'ఇలా' కళ్ళలోకి చూడాలనిపించేది. కాని పాడేప్పుడు ఆయన గాలిలోకి తప్ప ఎవరివంకా చూడరు.

ఓసారి ఇలాగే అందరం బీచ్‌కిపోయాం. కాసేపు ఇసకలో తిరిగి అలిసిపోయాం. రామకృష్ణ మిషన్ కాంటీన్‌లో కాఫీలు తాగటానికి కూర్చున్నాం.

సర్వర్ అయిదు కాఫీలు టేబిల్‌మీదపెట్టి బిల్లుకోసం లోపలికెళ్ళాడు. శాస్త్రిగారు ఒక్కసారి కాఫీ సిప్‌చేసి, సుగర్ తగ్గిందని ప్రక్కనపెట్టి 'సడన్'గా లోపలికెళ్ళారు. అంతా కబుర్లలో ఉండి ఎవ్వరం గమనించలేదు. ఆయన తిరిగొచ్చి 'నా కాఫీ ఏది' అన్నారు. తీరాచూస్తే ఆయన కాఫీ నేను సగం త్రాగేస్తున్నాను. ఎక్స్ట్రా కప్పు కృష్ణారావుగారి ప్రక్కనే వుంది.

'అరే దాన్ని నేను ఎంగిలి చేసానే' అన్నారు శాస్త్రిగారు... నాకు చచ్చే సిగ్గేసిపోయింది.

'కాఫీల మార్పిడి కావాలని కాదుకదా' అన్నారు కృష్ణారావుగారు. నా నరాలు కుంచించుకుపోయాయి.

'తియ్యందనము తగ్గెనా' అన్నారు కవిగారు.

'There is every danger of సంప్రదాయమ్' అన్నాడన్నయ్య! ఒక్కక్షణం కాలం ఆగిపోయింది.

శాస్త్రిగారు 'డోంట్‌వర్రీ' అని మిగిలిన కప్పు అందుకున్నాడు సుగర్, స్పూన్ అవతలపెడుతూ.

'పంచదార తగ్గిందేమో చెల్లీ, ఇది చేర్చు' అన్నారు కృష్ణారావుగారు. ఇంతవరకూ కథ రసం పుంజుకుని అన్నయ్య అన్న చివరి వ్యాఖ్యలో పతాకస్థాయికి చేరింది.

'అఖ్ఖర్లేదు. వాడినోట తియ్యటిపాటా, పంచదారా నస్తాయి' అన్నాడు. వాణ్ణి గొంతు పిసికేయాలనిపించింది. వాడి మాటలు ఎంత నగ్నంగా ఉన్నాయో తెలపటానికి ఆ తర్వాత సంభాషణ ఆగిపోవటమే నిదర్శనం.

* * *

అన్నయ్య నిష్కారణంగా నన్నూ శాస్త్రిగారినీ కలిపి ఏడిపించేవాడు. కావాలని వ్యాఖ్యానించేవాడు. మామధ్య లేని 'దాన్ని' ఉండాలనో, ఉందనో భావించి ఉత్సుకత సృష్టించేవాడు. కవిగారో, కృష్ణారావుగారో 'చెల్లాయ్, ఆర్ యు కమింగ్ విత్ అజ్ టు ఎ పిక్చర్' అంటే, వీడు

'నో, షి ఈజ్ వైటింగ్ ఫర్ శాస్త్రీ' అనేవాడు

అన్నయ్య భావం చాలా కాలం అంతుపట్టలేదు. శాస్త్రిగారి పట్ల నాకు ఇతరులఎడల లేని ప్రత్యేకాభిమానం ఉన్నట్లు ఎప్పుడూ బయటపడలేదు. ఇహ శాస్త్రిగారంటారా ... వరూధిని వచ్చి పలకరించినా 'ఇదేమిటి ?' అని నిశ్చింతగా ప్రశ్నించగలరు. అన్నయ్య

అన్నిసార్లు విపరీత వ్యాఖ్యానాలు చేసినా, సరిహద్దులు దాటినా ఎప్పుడూ శాస్త్రిగారు నాదగ్గర ఆ అవకాశం వినియోగించుకోలేదు.

ఎన్నోసార్లు అన్నయ్య ఇంకా కాలేజీనుండి రాకా, లైబ్రరీలో ఉండిపోయినా ఆలస్యం చేసేవాడు. శాస్త్రిగారూ, నేనూ ఒంటరిగా గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఎన్నడూ మాట పొల్లు పోలేదు. చూపులు వక్రించలేదు. చేతులు గిరి దాటలేదు. ఆయన హృదయంలో ఏముందో తెలుసుకోవాలన్న ఆరాటం నాకులేకపోలేదు. ఏ క్షణాన్నైనా ఆయన నా చెయ్యి పట్టుకుంటే గుండెల మీద వాలిపోయి అనుకున్నవన్నీ ఒక్కపడిగా చెప్పాలనిపించేది.

నా జీవితంలో ఈమహదవకాశం కల్గించిన అన్నయ్య, తండ్రి గాని తండ్రి, ఎప్పుడూ సుఖపడాలని కోరుకునేదాన్ని. ఈపాటికి ఏ పల్లెటూళ్ళోనో మసి పూసుకుని అంట్లు తోముకోవలసినదాన్ని, ఇంతమంది పెద్దవాళ్ల మధ్య నిలబెట్టి బ్రతుక్కి అర్థం చూపించాడు. ప్రపంచ విజ్ఞానాన్ని పరిచయంచేసుకునే భాగ్యం కలిగించాడు. చల్లని సాయంత్రాల్లో సముద్రపు ఒడ్డునచేరి మంచి మాటలు వినే అదృష్టం కల్పించాడు. అందరికీ అన్నయ్య లుంటారు. కాని ఇలాంటి వాళ్ళుంటారా ...

అన్నయ్యకు కవిత్వం తెలుసు. కళలు తెలుసు. కమ్యూనిజం మీద అనర్గళంగా మాట్లాడగలడు పోప్‌పాల్ సందేశాన్నీ, జీన్‌పాల్ సార్త్రే సిద్ధాంతాన్నీ కూలంకషంగా విమర్శించగలడు బర్ట్‌రెండ్ రసెల్ అంటే అన్నయ్యకు ప్రాణం, బెర్నార్డ్‌షా అంటే అన్నయ్యకు దైవం. ప్రజాస్వామ్యంలో మనస్సూ, సామ్యవాదంలో హృదయమూ ఉన్నాయంటాడు తను. మావో సేటుంగ్ ప్రాధాన్యతా, వియత్నాం ప్రాముఖ్యతా ఎంతో వివరంగా చెప్పగలడు. షెల్లీకీ, కృష్ణశాస్త్రికీ, శ్రీశ్రీకి మయకోవిస్కీకి పోలికలమీద ఉపన్యసించగలడు. రవిశంకర్ సితారూ, సుబ్బలక్ష్మి గొంతూ ఎలాంటివో శ్లాఘించగలడు. బాలమురళి పాటలూ, మహమ్మదాలీ పోటీలూ విశ్లేషించగలడు. విశ్వమానవతావాదంలో రాధాకృష్ణన్ పాత్రను సుదీర్ఘంగా వివరించగల అన్నయ్యలు ఎంతమంది కుంటారు ?

* * *

ఏమ్మే మొదటి సంవత్సరం ఇంకా రెణ్ణెల్లకయిపోతుందనగా నాన్న దగ్గర్నుండి అన్నయ్యకో ఉత్తరం వచ్చింది. 'నాకేదో మంచి పెళ్ళి సంబంధం కుదిరిందనీ, కుర్రవాడు ఆంజనేయులు ... భాషా ప్రవీణ ప్యాసై ఉద్యోగం చేస్తున్నాడనీ ... మంచి సుఫ్రరద్రూపి అనీను.'

నా మనస్సెందుకో కెలికినట్లయింది. ఆనందంగా గడిచిపోతున్న కాలం, పరీక్షలు రాసి ఫైనలియర్‌లో ప్రవేశించాలనే తాపత్రయం, శాస్త్రిగారి వీక్షణాల్లో మురిసిపోయే ముచ్చటా ఒకొలిక్కి రాకుండానే నాన్న 'ఈ ఉత్తర మేమి'టనిపించింది.

మొదటిసారి చదివినప్పుడు భాస్కరం చాలా తేలిగ్గా తీసుకున్నట్లు అవతల పారేసాడు. రెండో రోజుదయం మళ్ళీ చదివి కాసేపు నా వంకా, ఉత్తరం వంకా చూసి, ముఖంలో భావంమార్చి 'ప్చ్' అంటూ

'వెల్ కామూ, యు మేరీ శాస్త్రీ' అన్నాడు.

నా గుండె ఆగిపోయింది. వాడు లేచి ఎటో వెళ్ళిపోయాడు.

ఆ రోజుల్లా వాడన్న మాటల్లోని అక్షరాలు భేరీనాదాల్లా నాలో ప్రతిధ్వనించాయి వీడి ఉద్దేశ్యం ఏమిటి? ఆయన ఒప్పుకున్నాడా...వీళ్ళిద్దరూ అంతా నిర్ణయం చేసారా...? అసలు నాకు శాస్త్రిగారిని చేసుకోవటం ఇష్టమో, లేదో అడిగాడా ...

'యూ ఈట్ ఐస్‌క్రీం' అన్నట్లు

'యూ మేరీ శాస్త్రీ' అంటాడేవిటి ?

ఆ రాత్రికి వాణ్ణి కడిగేయాలనిపించింది. మామూలుగా వాడికంటే ముందు శాస్త్రిగారొచ్చారు. ఆయన్ను చూసి వింతగా నవ్వాను. ఏం చలనం గోచరించలేదు. పలకరింపు అనుకున్నారేమో.

శాస్త్రిగార్కి కాఫీ యిచ్చి కూర్చున్న తర్వాత ముందుగా ఆయన్నే అడగాలనిపించింది. ఇలాంటి తీయని అవకాశాలెన్నో రావు. ఆయన ఏమన్నా అనుకుంటే ... ఏమనుకుంటారు ? యిది వరకు భాస్కరం అన్న మాటలకంటే తప్పయిందేముందీ...కనీసం కళ్ళలోకైనా చూస్తారు...అది చాలు...తర్వాత ఏమైతే అదవుతుంది ... ధైర్యం కూడదీసుకుని ...

'కాఫీ బావుందా' అన్నాను.

'బాగుంది· మీరూ తీసుకోపోయారా' అన్నారు శాస్త్రిగారు !

'లేదు...ఇంకా భోంచేయలేదు...'

'చెయ్యండి...'

'అండీ, ఎందుకు ?'...తొలి సాహసం చేసాను !

శాస్త్రిగారు కళ్ళెత్తి చూసారు. మరోలా భావించినట్లు కన్పించలేదు.

'తప్పేముంది ?' అన్నారు.

'తప్పు గురించి కాదు... ఒప్పు గురించి...' శంకరాచార్యుడికి తత్వం బోధించే చంటిపిల్లలా మాట్లాడాను.

'నీవు అంటే బావుంటుందా...' శాస్త్రిగారి కళ్ళల్లో ఏదో వెలుగు ...

'ఓసారి అని చూస్తే తెలుస్తుంది...'

శాస్త్రిగారు అర్ధవంతంగా నవ్వారు...కాఫీ సగం సాసర్‌లో పోసి

'తీసుకో' అన్నారు.

మాట్లాడకుండా తీసుకున్నాను. నేను చేసిన కాఫీ నాకే ఎంతో రుచిగా వుంది.

* * *

వేసవి శలవలకు ఇంటికి వెళ్ళేముందు అన్నయ్యకు రెండేళ్ళ పాటు జర్మనీలో 'రీసెర్చి'కి స్కాలర్‌షిప్ వచ్చినట్లు తెలిసింది. అన్నయ్య తన స్నేహితులకు పెద్ద పార్టీ యిచ్చాడు. పార్టీలో శాస్త్రిగారు తన ప్రక్క కూర్చోవటం చూసిన కృష్ణారావుగారు

'సుభద్ర ఏదీ' అన్నాడు.

'లోపలుంది' అన్నాడన్నయ్య కించిత్తు సంశయం లేకుండా. నేను వింటూనే వున్నాను. నిండుగా, నిబ్బరంగా కూర్చున్న శాస్త్రి గారి ముఖంలో చిరునవ్వుకు మించి ఏమీ లేకపోవటం చూసాను.

శలవలకు ఇంటికి వెళ్ళేముందు అన్నయ్యతో

'నాన్నకేం చెప్పమంటావురా' అన్నాను.

'త్వరలో వస్తానని చెప్పు.'

'అదికాదు...ఆ విషయం...'

'జర్మనీ వెళ్ళేముందు మాట్లాడతానని చెప్పు.'

నాకెందుకో నిరుత్సాహం వేసింది. వాడి మాటలు సంతృప్తి కలిగించలేదు. శాస్త్రిగారు స్టేషన్ కొచ్చారు. అన్నయ్య ప్లాట్ ఫారమ్ మీద ఆయనతో 'జర్మన్ వే ఆఫ్ లైఫ్' మీద మాట్లాడు తున్నాడు. జర్మనీలో రైల్వే సిస్టమ్‌యొక్క విశిష్టత వర్ణిస్తు న్నాడు. కనీసం మా యిద్దరికీ ఓ క్షణం అవకాశం యివ్వాలని కూడా వాడికి తోచలేదు. టైమయిపోయింది.

బండి కదుల్తున్నప్పుడు

'గుడ్‌లక్ కామూ, కేరీ ఆన్' అన్నాడు భాస్కరం.

కిటికీలో ఉన్న నా చెయ్యి వేళ్ళలో ఒకటి రెంటికి తగిలే టట్లు శాస్త్రిగారు చెయ్యి వేసారు. బండి కదిలింది.

భాస్కరం అప్పుడే 'హిగ్గిన్ బాదమ్స్'వేపు నడుస్తున్నాడు.

శాస్త్రిగారు కనిపించినంతవరకు చూసారు.

* * *

శలవల్లో నాన్న ప్రతిరోజూ సతపోరాడు. 'భాషాప్రవీణ'గర్ని చేసుకోమని. సంప్రదాయముందట. కావలసిన వాళ్ళట. కానీ పుచ్చుకోకుండా చేసుకోటాని కొస్తున్నారట.

నాకిష్టం లేదనీ, ఎన్నిసార్లు చెప్పినా వినటంలేదనీ గ్రహించి నాన్న చివరికొసారి ...

'ఆ శాస్త్రి కుర్రాణ్ణి చేసుకుంటావేమిటి ? అన్నీ విచారిం చాన్లే...వాళ్ళ వంశం అడుక్కుతిన్నట్లుంది...వాళ్ళ వాళ్ళలో కప్ప దాట్లున్నాయంట కూడాను ... మనోనిబ్బరం లేని మనుషులుగా తెల్సింది...'

'భాస్కరం అన్నయ్య...' అన్నాను. ఏమనాలో తోచక.

'నేను వివరంగా రాస్తే వాడు కూడా ఈ విషయం అంగీక రించాడు.'

'ఏమన్నాడు...'

'నామాటే కానిమ్మన్నాడు.'

ఆకాశం బద్దలయింది. భూమి కరిగిపోయింది. ఒంటిమీద నిప్పుల వర్షం కురిసింది. కన్నీరు తుడుచుకునే నా చెయ్యి నాకే త్రాచుపాములా అనిపించింది.

* * *

ఆంజనేయులుగారితో నా వివాహం జరిగిపోయింది.

జర్మనీ వెళ్ళేముందు అన్నయ్య ఇంటికి రాలేదు. నాన్నకూ తనకూ ఏం ఉత్తరాలు నడిచాయో నాకు తెలియదు. నా పెళ్ళికి రెండ్రోజులు ముందే అన్నయ్య జర్మనీ వెళ్ళేందుకు బొంబాయిలో విమాన మెక్కాడు.

శలవల్లో శాస్త్రిగారికి అన్నీ వివరిస్తూ ఉత్తరం రాసాను. శాస్త్రిగారు వెంటనే జవాబు రాసారు ...

''డియర్ కామేశ్వరీ,

భాస్కరంతో ఎంతోసేపు ఈ విషయంమీద చర్చించాలను కున్నాను. జర్మనీ వెళ్ళే హడావుడిలో ఎంతో ప్రయత్నంమీద రెండు ముక్కలు మాట్లాడాడు. సారాంశం 'ఈ పెళ్ళిలో తనపాత్రేమీ లేదనీ...అంతా మీ తండ్రిగారిదనీ...'

నాకో చెల్లెలుంది కామేశ్వరీ. ఇప్పుడు తను మద్రాసులో ఉంటుంది. ఆమె భర్త సినిమాల్లో పనిచేస్తున్నాడు. వాళ్ళు సుఖం గానే ఉంటున్నారు. వాళ్ళు తమ పెళ్ళికి లోకం అనుమతి పొందలే దన్నది నిజమే. ఎందుకు పొందాలో నాకూ అర్థం కాలేదు లోకం నుండి వాళ్ళాశించింది కూడా ఏంలేదు. ఇప్పటికీ ఆ సంఘటన నుండి మా యింటిని బయటపడ నీయటం లేదు. మా చెల్లి చేసిన నేరం (?) మమ్మల్ని శిక్షించాల్సివస్తే ఆశిక్షను తియ్యగా స్వీకరించ టానికి నేను సంసిద్ధుణ్ణే.

కాని లోకాన్ని ఎదిరించమనీ, స్వేచ్ఛ సంచరించమనీ, ధైర్యంగా జీవించమనీ పెద్దగా చదువుకోని మా బావకు భాస్కరం లాంటి వాళ్ళే చెప్పారు. కులం వంటి నీచ నియమాల్ని వదిలి ప్రేమించినమ్మాయితో వెళ్ళిపొమ్మని ఉపదేశించారు. ప్రబోధంనోరు జారిన తర్వాత అంశం తనక్కూడా వర్తిస్తుందని భాస్కరాలు గమ నించారో, లేదో...జీవితం సైన్సు పాఠంలా చెప్పేయటానికి వీల్లేని దని భాస్కరం తెలుసుకున్నట్లు లేదు.

అన్నట్లు మొన్న భాస్కరం మరో ముక్క కూడా అన్నాడు. 'అరే శాస్త్రీ మేధావులమైన మనం బుర్రలతోనే కొట్టు కోలేక చస్తుంటే, ఈహృదయాలతో ఎక్కడ బాధపడగలం అని.'

మన పెళ్ళి విషయానికీ వాడి మాటలకూ ఏదో సంబంధం ఉన్నట్లు తోస్తుంది. ఈనెల పదహారున వాడి ప్రయాణం·

నిన్ను పెళ్ళాడినా లేకపోయినా నువ్వే నా జీవితంలో మొదటి స్త్రీవి. ఆఖరి స్త్రీవి.

ఇది సత్యం. భాస్కరం మేధస్సుపై ఒట్టు.

ఉంటాను కామేశ్వరీ,

నీ

శాస్త్రి."

*　　　*　　　*

ఇరవై అయిదేళ్ళ తర్వాత ..

అన్నయ్య ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పని చేస్తున్నాడు. చాలాకాలానికి వాడి కూతురు 'నవత' పెళ్ళిలో కలుసుకున్నాను మళ్ళీ. నవతను ఎవరో బెంగాలీ అబ్బాయి ప్రేమించి చేసుకుంటున్నాడు.

పందిరంతా కోలాహలంగా వుంది. అన్నయ్య స్నేహితులు ఎంతోమంది వచ్చారు· వాళ్ళ మధ్యలోఉన్న అన్నయ్యకు బంధువుల్ని పలకరించే తీరిక కూడా కన్పించలేదు.

వాడితో నోరారా మాట్లాడి ఎన్నాళ్ళయిందో ... పలుకుల్లో పంచదార చిలికించే నా అన్నయ్యతో మాటలకైనా నోచుకోలేదనుకున్నప్పుడు భోరుమని ఏడవాలనిపిస్తుంది.

మా పెళ్ళి తర్వాత వాడు నాతో మాటలు తగ్గించేసాడు.

కానీ...కానీ...రెండు ముక్కలు అడగాలనుంది .. నా పెళ్ళికి ముందు

అన్నయ్యా 'కామ్యూ యూ మేరీ శాస్త్రీ' అన్నావు. 'యస్. అయామ్ మేరీయింగ్ ఆంజనేయ శాస్త్రీ' అని రాసాను. దానికి సమాధాన మేమంటాడో అడగాలనుంది ... శాస్త్రిగారు ఎక్కడున్నారో తెలుసుకోవాలనుంది.

'విశాఖ బీచిలో ముగ్గురం కలిసి నడిచిన రోజులు గుర్తున్నాయ్రా అన్నయ్యా' అని ఒక్కసారి వాణ్ణి అడగాలనుంది. అన్నయ్య పెద్దవాడు . హోదా కల్గినవాడు ... పల్లెటూళ్ళో కాపురం వుండే పంతులు భార్యను . వాడి కూతురు పెళ్ళిలో నిష్ఠూరాలు పలికి, కన్నీళ్లు పెట్టి వాడి కశుభం కోరలేను. వాడి కూతురు పండు వెన్నెల్లా ప్రకాశించే సమయం నవత నాలాంటిది కావాలని ఎక్కడుంది ఎందుకవుతుంది. దాని తండ్రి అన్నీ తెలిసినవాడు .. అన్నీ తెలిసినవాడు ... !!

# సముద్రం

## కుమారి పురాణం ప్రభాతలక్ష్మి

ఎందుకు నేస్తం! అందరూ సుదూర తీరాలకేసి
　నింగి, నేల కలిసే ఒంపుకేసే చూస్తారు?
వినీల సాగర తరంగాలకేసి ఉత్సుకతతో చూడడం ఎందుకు?
ఏముందని వెతుకుతారు సముద్రపుటలలలో !
ఏ జీవిత సత్యాలు తెలుసుకోవడానికి ?
ఏ మానవత్వపు విలువలాకళించుకోవాలనీ ?
ఒక్కసారి వెనుతిరిగి నేలకేసి చూస్తే,
ఎన్ని జీవాలు ! ఎన్నెన్ని జీవితాలు !
సముద్రపు టలలలాంటి కష్టాలలో చిక్కుకుని ఎగిసిపడుతూ,
సముద్రం కంటే లోతైన మనసుల నిండుగా
తీరని వ్యధలతో, బాధల బరువులతో
మనుగడ సాగిస్తున్న ఆర్తజీవనాదాలెన్నో,
సముద్రపు హోరును మించుతాయి, మనలని ముంచుతాయి.
సముద్రమే సానుభూతితో నేలను తాకి ఓదారుస్తుంటే,
ఎందుకు నేస్తం! అంతా సముద్రపు లోతుల్లోకి చూస్తారు?
ఒక్కసారి వెనుదిరిగి చూస్తే,
చూసి ఆలోచిస్తే,
మానవజన్మ కర్థం ఏర్పడదా ? పరమార్థం బోధపడదా?